క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ ఎన్నిక



పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గంతో ఎంపీడీఓ సుజాత

కడ్తాల్: పంచాయతీ కార్యదర్శుల సంఘం కడ్తాల్ మండల అధ్యక్షుడిగా రావిచేడ్ సెక్రటరీ తిరుపతి ఎన్నికయ్యారు. మంగళవారం ఎన్నుకున్న నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా శంకర్(గోవిందాయిపల్లి), అసోసియేట్ అధ్యక్షురాలిగా సాయిలక్ష్మి(మర్రిపల్లి), ఉపాధ్యక్షులుగా జంగయ్య(మైసిగండి), జి.జంగయ్య(కర్కల్‌పహాడ్), ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్‌గౌడ్(బాలాజీనగర్), కోశాధికారిగా మహేశ్ (నార్లకుంటతండా), సభ్యులుగా రాజశేఖర్, సందీప్, ఛోటే, జగదీశ్, శివప్రసాద్, క్రిష్ణమాచారి, కుమార్, అశ్వక్‌బేగ్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో బుధవారం రాత్రి నిర్వహించే శివపార్వతుల కల్యాణ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. ఆలయం వద్ద కొనసాగుతున్న ఏర్పాట్లను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు సర్వేశ్వర్, అంజయ్య, రమేశ్, మల్లప్ప, బుచ్చప్ప, మల్లికార్జున్, ఈశ్వరప్ప,మహేశ్,రాజు, వెంకటేశ్, ఆలయ అర్చకులు రామశర్మ తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాల చెల్లింపునకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మాడ్గుల: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ కలిసి వినతిపత్రం అందజేశారు. జనవరి నెలకు సంబంధించిన వేతనం కూడా రాకపోవడంతో పూట గడవటం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతినెలా మొదటి వారంలోనే జీతాలు అందేలా చూడాలని కోరారు. వేసవి నేపథ్యంలో ఒక్క పూట పని చేసేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

సీఐ వేణుగోపాల్‌రావు



మాడ్గుల: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు తమవంతుగా సహకరించాలని మాడ్గుల సీఐ వేణుగోపాల్‌రావు కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏ సమస్య ఎదురైనా ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్ రావాలని సూచించారు. బాధితులకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని, ప్రతి గ్రామంలో వీటి ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపుపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలు కుటుంబాలకు ఆర్థిక చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

కడ్తాల్: కడ్తాల్‌తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. కడ్తాల్‌లో మరణించిన మైసమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. అనంతరం గోవిందాయిపల్లిలో మృతి చెందిన భారతమ్మ, మమత, యాదమ్మల కుటుంబాలను ఓదార్చి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ గుప్తా, నాయకులు జోగు వీరయ్య, ఎల్లాగౌడ్, రాంచంద్రయ్య, నర్సింహ, కృష్ణ, మహేశ్, సురే తదితరులు పాల్గొన్నారు.

శివయ్య వేడుకలకు సర్వం సిద్ధం

మహాశివరాత్రికి ముస్తాబైన ముక్కంటి ఆలయాలు

- నందివనపర్తి, రాచకొండగుట్టల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లను పరిశీలించిన పోలీసు, దేవాదాయ శాఖల అధికారులు



ఓంకారేశ్వరాలయంలో ప్రతిష్ఠించిన పార్వతీపరమేశ్వరులు



నందివనపర్తిలో భక్తులకు దర్శనమిస్తున్న ఏడడుగుల నందీశ్వరుడు

యాచారం: పురాతన చరిత్ర కలిగిన నందివనపర్తి గ్రామానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. అక్కన్న, మాదన్నల కాలం నాటి 11వ శతాబ్దంలో ఇక్కడ 101 నందులను ప్రతిష్ఠించారు. ఈ కారణంగానే నందివనపర్తి అనే పేరు వచ్చింది. గ్రామం చుట్టూ వంద నందులను ప్రతిష్ఠించిన పూర్వీకులు ఊరి మధ్య ఏడడుగుల నందీశ్వరుడిని ప్రతిష్ఠించారు. ఇక్కడ మొక్కుకున్న వారి కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. నందీశ్వరుడికి ఎదురుగా శివలింగం, ఆ ముందే పార్వతీ, పరమేశ్వరుల విగ్రహాలు ఉండడంతో మహా శివరాత్రి రోజు ఇక్కడి నందీశ్వరుడిని దర్శించుకుంటే కాశీ విశ్వనాథుడిని దర్శించుకున్నంత పుణ్యఫలం కలుగుతుందని పెద్దలు చెబుతారు. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో గ్రామానికి తూర్పు దిక్కున శివలింగం స్వయంభుగా ఏర్పడింది. అనంతరం పూర్వీకులు శివాలయాన్ని నిర్మించారు. ఆలయంలో స్వయంభువుగా వెలిసిన శివలింగానికి చెంబుడు నీళ్లతో అభిషేకం చేస్తే శ్రీశైలం పుణ్యక్షేత్రంలోని శివలింగానికి అభిషేకం చేసినంత పుణ్యం దక్కుతుందని భక్తుల నమ్మకం. ఓంకారేశ్వరాలయంలోని పార్వతి, పరమేశ్వరులు భక్తుల పాలిట ఇలవేల్పుగా వెలుగొందుతున్నారు. రాష్ట్రంలోనే ఏ దేవాలయానికి లేని విధంగా నందివనపర్తిలోని ఓంకారేశ్వరుడికి 1,400 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు ఉన్నాయి. ప్రస్తుతం వీటి విలు రూ.వందల కోట్లల్లో ఉంటుంది. ఇంత ప్రాముఖ్యత కలిగిన నందివనపర్తిలోని ఏడడుగుల నందీశ్వరుడు, స్వయంభు శివలింగం, ఓంకారేశ్వరుడిని మహా శివరాత్రి పర్వదినం రోజున దర్శించుకునేందు రంగారెడ్డితో పాటు నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, నల్గొండ, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. గ్రామంలోని ప్రతిఒక్కరూ తమ తమ బంధువులను పిలిపించుకుని వేడుకలు చేసుకుంటారు. నాలుగు రోజుల పాటు ఈ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంటుంది.

ఇలా చేరుకోవచ్చు..

హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి దేవరకొండ బస్సులో యాచారంలో దిగి, రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న నందివనపర్తికి చేరుకోవచ్చు. ఎంజీబీఎస్‌లో కల్వకుర్తి బస్సులు ఎక్కి కందుకూర్ చౌరాస్తాలో దిగి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న నందివనపర్తికి చేరుకోవచ్చు. నల్గొండ జిల్లా నుంచి వచ్చే భక్తులు మాల్‌కు చేరుకుని యాచారంలో బస్సు దిగి నందివనపర్తికి చేరుకోవచ్చు. నాగర్ కర్నూల్ జిల్లా నుంచే భక్తులు కందుకూరు గేట్ వద్ద బస్సు దిగి నందివనపర్తికి చేరుకోవచ్చని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇబ్రహీంపట్నం డిపో నుంచి ప్రతీ పది నిమిషాలకు ఓ బస్సు యాచారం నుంచి ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం నుంచి నందివనపర్తి మీదుగా కందుకూరుకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తాయి.

రాచకొండలో ఏర్పాట్లు పూర్తి



స్వయంభూ శంభులింగేశ్వర స్వామి

మంచాల: రాచకొండగుట్టల్లో మహా శివరాత్రి ఉత్సవాలకు అని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా మంగళవారం రాచకొండ శివాలయాని పోలీసు, దేవాదాయశాఖల అధికారులు సందర్శించారు. రాచకొండగుట్టలు యాదాద్రి భువగిరి, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల సరిహద్దులను కలిగిఉన్నాయి. నాటి రాచకొండ రాజులు శివభక్తులు కావడంతో పలు శివాలను నిర్మించారు. ఇక్కడ స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయం ఎంతో విశిష్టత గలది. రాచకొండ రాచప్ప సమితి ఆధ్వర్యంలో ప్రతీ సోమవారం భక్తులకు అన్నదానం చేస్తున్నారు. వందల్ల ఏళ్ల నాటి శివుడికి పూజలు చేస్తే కోరిన కోరికలు తీరుతాయనిభక్తుల నమ్మకం.

ఉర్సు వేడుకలు

శివాలయానికి సమీపంలో గాలిబ్‌బాబా దర్గా ఉంది. ఏటా ఫిబ్రవరి 24నుంచి 28 వరకు ఉర్సు వేడుకలు కొనసాగుతాయి. కులమతాలకు అతీతంగా భక్తులు ఉత్సవాల్లో పాల్గొంటారు.

ముందస్తు ఏర్పాట్లు

మహాశివరాత్రికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. రాచకొండ డీసీపీ రమేష్‌చంద్ర, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ రాములు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవాదాయశాఖ నల్గొండ జిల్లా సహాయ కమిషనర్ కె.భాస్కర్, భువనగిరి డివిజన్ పరిశీలకులు వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులకు అన్ని వసతులు కల్పించారు.

ఎంతో విశిష్టత



స్వయంభుగా వెలిసిన రాచొకొండ శివాలయానికి ఎంతో విశిష్టత ఉంది. స్వామివారిని దర్శించుకొని పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయి. శివయ్యకు నిత్య పూజలు నిర్వహిస్తున్నాం. శివరాత్రి వేడుకలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం.

– శరత్‌పంతులు, ప్రధాన అర్చకుడు

రోడ్డు విస్తరణకు సహకరించండి

- అర్హులైన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: పట్టణంలోని మాడ్గుల రోడ్డు విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు అండగా ఉంటామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. బాధితుల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో మంగళవారం బాధితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన రహదారి విస్తరణ పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణను 60 ఫీట్లు కాకుండా 50 ఫీట్లు చేపట్టాలని కోరగా.. ఇందుకు అంగీకరించారు. ఈ మేరకు మార్కింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. రెండు మూడు రోజుల్లో ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమవుతాయని, యంత్రాలతో కూల్చివేతలు కొనసాగుతాయని చెప్పారు. మున్సిపాలిటీకి మంజూరైన రూ.4 కోట్లతో సీసీ రోడ్లు, రూ.2 కోట్లతో నూతన మున్సిపల్ భవనం నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దుర్గయ్య, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కండె పాండురంగయ్య, వస్పుల శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు అప్పం శ్రీనివాస్, విజయ్, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, తహసీల్దార్ లలిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో మృతిచెందిన పాపమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు యాదయ్యగౌడ్, నర్సింహాగౌడ్, మల్లయ్య, ఈదమయ్య తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐ హన్మంతరెడ్డి విగ్రహానికి ఘనంగా జోహార్లు



ఎస్‌ఐ హన్మంతరెడ్డి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న పోలీసులు, కుటుంబ సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తూ నక్సల్స్ కాల్పుల్లో మృతిచెందిన దివంగత ఎస్‌ఐ కాసం హన్మంతరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్, పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు హన్మంతరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ బాల్‌రెడ్డి, రాంరెడ్డి, సాయిబాబా, జ్యోతి, ప్రణయ్‌కుమార్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన



ఆమనగల్లులో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

ఆమనగల్లు: పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటివారికి పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుజాతారెడ్డి, చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్, డైరెక్టర్ సావిత్రి, అకాడమిక్ అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీశైలం, ఉపాధ్యాయులు రేవతి, రమాదేవి, మాధురి, యాదయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మహేశ్వరం: గ్రామీణ ప్రాంత పేదలకు అవేర్ సంస్థ వారు ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం అభినందనీయమని మాణిక్యమ్మగూడ మాజీ సర్పంచ్ మాసారం చంద్రయ్యగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాణిక్యమ్మగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి రోగులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 96 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అనిత, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, అవేర్ సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకన్న, డైరెక్టర్ వరుణ్, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ పడిపూజ



కడ్తాల్: మహాపడిపూజలో భక్తులు,నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని ముత్తమాధారం గ్రామంలో మంగళవారం మహా శివపడి పూజను శివమాలధారణ స్వాముల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాల ధరించిన స్వాములు ఇరుముడి ధరించి శ్రీశైల క్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.


నివాళి



నివాళి అర్పిస్తున్న కిషన్‌రెడ్డి తదితరులు

మంచాల: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్ తండ్రి అంజయ్య(75) మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం ఆరుట్లలో నిర్వహించిన అంజయ్య అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, మంచాల పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు ఇలవేల్పుగా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి వేడుకలు ప్రారంభం



ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



విఘ్నేశ్వర, కలశ పూజలు చేస్తున్న అర్చకులు భక్తులు



కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండిలో శివరామాలయాల్లో కొలువైన శ్రీకాశీవిశ్వనాథ స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం వేదపండితులు, అర్చకులు, ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. ఇందులో భాగంగా తొలిరోజు విఘ్నేశ్వర పూజ,. ధ్వజారోహణ, కలశపూజ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, ట్రస్టీ శిరోలి, ఈఓ స్నేహలత, తహసీల్దార్ జ్యోతి, నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్ ఆలయ అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ఆర్థిక సాయం



రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీనుకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: కడ్తాల్‌కు చెందిన పలు కుటుంబాలను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. కడ్తాల్‌కు చెందిన కూకుట్ల శ్రీనును పరామర్శించి, మెరుగైన చికిత్స కోసం రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. అనంతరం ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై గాయపడిన బోసు రాఘవేందర్‌ను కలిసి రూ.5 వేలు అందజేశారు. రెండు రోజుల క్రితం కడ్తాల్‌లో మృతిచెందిన లక్ష్మమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు అందించారు. మరో మృతురాలు మైసమ్మ కుటుంబానికి రూ.15 వేలు అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, నాయకులు కేశని మహేశ్, చేగూరి మహేశ్, వెంకటేశ్, క్యామ వెంకటేశ్ ఉన్నారు.

తాగునీటి సమస్య రానివ్వం

- ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి
- యాచారం, చౌదర్‌పల్లిలో పర్యటన



యాచారంలో బోరుబావి మోటార్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని యాచారం, చౌదర్‌పల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. నిరుపయోగంగా ఉన్న బోరుబావులను పరిశీలించారు. మిషన్ భగీరథ నీళ్ల సరఫరా కానప్పుడు ప్రత్యామ్నాయంగా బోరుబావుల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఈజీఎస్ నిధులతో చేపడుతున్న మేకలు, గొర్ల షెడ్లను పరిశీలించారు. ఆయన వెంట ఈజీఎస్ ఈసీ శివశంకర్‌రెడ్డి, యాచారం పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య ఉన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం స్వామికి ప్రత్యేకపూజలు, అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం శివకోటి జపయజ్ఞం, భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బట్టు నర్సిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఎన్‌టీ పంచాక్షరి, మల్లప్ప, యాదగిరిరెడ్డి, వీరయ్య, యాదయ్య, శ్రీనునాయక్, పంతు నాయక్, యాదీలాల్, వైద్యనాద్, సురేశ్, చందు తదితరులు పాల్గొన్నారు. తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామ సమీపంలోని మల్లప్పగుట్టపై వెలసిన శ్రీ మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వేడుకగా కొనసాగుతున్నాయి. అర్చకులు గోపాల కృష్ణశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, రుద్రాభిషేకం, హోమం, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు కల్లు పెంటారెడ్డి, శేఖర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మాకం పాండయ్య, దామోదర్‌రెడి, నారాయణరెడ్డి, మల్లారెడ్డి, బుచ్చిరెడ్డి, శివుడు తదితరులు పాల్గొన్నారు. బుధవారం నిర్వహించే మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవంలో శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొంటారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని అన్ని మజీద్‌ల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపల్ అధికారులు, ముస్లిం నాయకులతో కలిసి మంగళవారం సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 190 మజీదులు ఉన్నాయన్నారు. ఆయా మజీదుల వద్ద తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుద్దీపాల సమస్య లేకుండా చూడాలని అధికారులు ఆదేశాలిచ్చామన్నారు. అక్కడక్కడా కొన్ని స్తంభాలు లేవని, స్తంభాల ఏర్పాటు, రోడ్లకు మరమ్మతులు, లైటింగ్ సదుపాయాల కోసం ఒక్కో వార్డుకు రూ.1లక్ష కేటాయించామని తెలిపారు. ఇమామ్, మోజంలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గౌరవ వేతనం ఇచ్చేవారమని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన రిజర్వాయర్లు పూర్తయినందున, ఇకపై రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తామన్నారు. మున్సిపాలిటీలో మొత్తం 123 బోర్లు ఉన్నాయని, అందులో 90 మాత్రమే పని చేస్తున్నాయని, మిగిలిన వాటికి మరమ్మతులు చేయాలని సూచించామని పేర్కొన్నారు. రంజాన్ ప్రార్థనలకు సంబంధించిన ఏడు ఈద్గాల వద్ద సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీమేరకు మజీద్‌లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని, ముస్లింలకు రంజాన్ తోఫా కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్, డీఈ ఇఫ్రత్ ఆయేషా, మాజీ చైర్మన్ అబ్దుల్లా సాది, నాయకులు సూరెడ్డి కృష్ణారెడ్డి, ఫర్యాద్దీన్ హామెద్, యంజాల జనార్దన్, షేక్ అఫ్జల్, శంకర్, అర్జున్, సయ్యద్ యూసుఫ్ పటేల్, శంషొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

జల్‌పల్లి మున్సిపాలిటీలో 64 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పి.సబితారెడ్డి మంగళవారం అందజేశారు. పహాడీషరీఫ్‌లోని ప్రీమియర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని బాలాపూర్ తహసీల్దార్‌తో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పండ్ల ధరలకు రెక్కలు



ఇబ్రహీంపట్నం: పండ్ల దుకాణాలు



శివరాత్రి సందర్భంగా ఇబ్రహీంపట్నంలో వెలసిన పండ్ల దుకాణం

ఇబ్రహీంపట్నం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు ముస్తాబయ్యాయి. ఇబ్రహీంపట్నంలోని శ్రీభవానీ నాగలింగేశ్వర, ఈశ్వరాంజనేయ, శ్రీలక్ష్మీనృసింహ, వీరభద్రేశ్వర, త్రిశక్తి, మార్కెండేయ ఆలయాల్లో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసదీక్షలో ఉన్న భక్తులు సాయంత్రం శివాలయాలకు వెళ్లి శివలింగానికి అభిషేకాలు, పూజలు చేస్తారు. అనంతరం పండ్లను ఆరగించి దీక్షను విరమిస్తారు. ఇబ్రహీంపట్నంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో పండ్ల దుకాణాలు వెలిశాయి. అరటి పండ్లు, ద్రాక్ష, యాపిల్, బత్తాయి, సపోట, కర్బూజా, వాటర్‌మిలాన్, పైన్‌ఆపిల్, కర్జూర ధరలకు రెక్కాలొచ్చాయి. సాధారణ రోజులతో పోలిస్తే ముప్పైనుంచి నలభైశాతం ధరలు పెరిగాయి.